కాలుష్య రహిత తెలంగాణ కొరకు కృషి చేద్దాం

- పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలి
- మొక్కలు నాటడం, పెంచడం జీవిత చర్యల్లో భాగం చేయాలి
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- గోల్కొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మొక్కలు నాటిన మంత్రి

విశ్వంభర, హైదరాబాద్: భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి, వాటిని పెంచి కాపాడాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్యమండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన గోల్కొండ ఏరియా హాస్పిటల్ లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షేట్కార్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి పక్షాన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్న మని,చెట్లు నీడ ఇవ్వడంతో పాటు ఆక్సిజన్ అందిస్తాయని అన్నారు. చెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ లో వచ్చే తరం ఆక్సిజన్ పెట్టుకునే స్థాయికి వస్తుందని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని అన్నారు. కాలుష్యం పెరిగిపోయి ప్రజలు క్యాన్సర్, షుగర్ వ్యాధులను బారినపడి మందులపైఆధారపడుతున్నారని, కాలుష్యం పెరగకుండా హైదరాబాద్ మరో ఢిల్లీ కానీయ కుండా, హైదరాబాద్ ప్రకృతి కి మారు పేరుగా ఉండాలంటే ఇక్కడ మనం చెట్లు నాడాలని,కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. గోల్కొండ ఏరియా హాస్పిటల్ కి వచ్చే వారికి మొక్కలు నాటే అవగాహన కల్పించాలని అన్నారు. తెలంగాణ మాది అనుకునే ప్రతి వ్యక్తి

పర్యావరణాన్ని కాపాడడానికి ఒక శక్తిగా పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నానాటి ప్లాస్టిక్ ను మన దైనందిన జీవితం నుండి దూరం చేయాలని,మొక్కలు పెంచడం మన దిన చర్య గా భావించి జన్మదినం లకు ప్రత్యేక రోజులకు మొక్కలు నాటాలన్నారు.హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ చెట్టు నీడతోపాటు ప్రకృతి సహజమైన ఆక్సిజన్ ను అందిస్తుందని,చెట్లు నీడ వెలకట్ట లేనిదని చెట్లు ప్రగతికి మెట్లని ప్రతి ఒక్కరూ చెట్టు ను నాటి సమాజంలో మార్పు తీసుకురావాలని శుభ కార్యక్రమాల్లో కేకులను కట్ చేసి హంగామా సృష్టించే బదులు మొక్కలు వాడాలని అన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వాడే బదులు జూట్ బ్యాగుల ను వాడాలన్నారు.కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మహియుద్దీన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని అన్నారు. గోల్కొండ ఆసుపత్రిలో ప్రతిరోజు 1200 నుండి 1500మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని తెలిపారు.ఆసుపత్రిలో కొత్త భవనం నిర్మించేందుకు 6 కోట్లు , యంత్రాల కొనుగోలు కోసం 1.80 ట్ల రూపాయలు మంజూరైనవని తెలిపారుఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులు అదనంగా అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ పి. సురేష్, డి సి హెచ్ ఎస్ సూర్య కుమారి, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు శ్రీనివాసరావు, కార్పొరేటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు , గోల్కోడ ఏరియా హాస్పిటల్ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శనలతో గానసభ నిత్యం కళామయం: జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు

విశ్వంభర, హైదరాబాద్: పలు రంగాలలో ప్రముఖులు చిత్ర పటాలు ఆడిటోరియం లో ఏర్పాటు తో పాటు ఏడు వేదికల్లో కళా ప్రదర్శనలు తో నిత్యం కళామయం రూపొందిందని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు అన్నారు. ఎందరో మహానుభావులు పేరిట గత కాలపు ప్రఖ్యాతులు స్మరిస్తూ చేస్తున్న కార్యక్రమాలు అపురూపం అని అన్నారు హైదరాబాదు చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చిక్కడపల్లి ప్రముఖ గాయని సంయుక్త ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి కీర్తనలు, కర్ణాటక సంగీత కార్యక్రమం గాన సభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం సంయుక్త ను సత్కరించిన అనంతరం జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల పైగా గాన సభ ప్రస్థానం లో కళా సుబ్బారావు, కళా దీక్షితులు, అనంతరం ప్రస్తుత అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి కృషి చేశారని అభినందించారు. కులమతాలకు అతీతంగా ఉచితంగా వివాహనాల నిర్వహణకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. దీంతో పాటు శాస్త్రీయ, కర్ణాటక సంగీతాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం విశేషమని అన్నారు. ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించడం కళాకారులను, కళలను ప్రోత్సహించిట్లవుతుందని అన్నారు. కార్యక్రమంలో గానసభ పాలక మండలి సభ్యులు గుండవరపు గీతాదేవి, శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసులో సీజైన గంజాయి అమ్మకం

గంజాయి కేసులో తాండూర్ ఎక్సైజ్ కానిస్టేబుల్

తనిఖీల్లో పట్టుకున్న షాద్ నగర్ పోలీసులు

1.5 కిలోల గంజాయి పట్టివేత

షాద్ నగర్ సిఐ విజయకుమార్ వెల్లడి

విశ్వంభర, హైదరాబాద్: షాద్ నగర్ లో పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తున్న సమయంలో ఓ యువకుడిని అదుపులోకి తీసుకోగా అతని వద్ద కిలోన్నర గంజాయి లభించింది.. తీగ లాగితే డొంక కదిలినట్టు తాండూరు ఎక్సైజ్ కార్యాలయంలో సీజ్ అయిన గంజాయిని బయటికి తీసి ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ దీనిని తన బంధువు ద్వారా విక్రయించేతువు తీసుకు వెళుతుండగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంచలన సంఘటన వివరాలను షాద్ నగర్ పట్టణ సిఐ విజయ్ కుమార్ గురువారం ఈ కేసుకు సంబంధించిన విషయాలు మీడియాకు వెల్లడించారు. ఈనెల 4వ తేదీన పట్టణంలోని ఫరూక్ నగర్ యాదవ కాలనీ ఈద్గా వద్ద స్థానిక ఎస్సై దేవరాజ్ వాహనాల తనకి చేస్తుండగా అంజద్ (32) అనే యువకుడు చేతిలో కవర్ తీసుకొని అనుమానాస్పదంగా వెళుతుండగా పోలీసులు అతని వద్ద సోదా చేశారు. చేతి కవర్ లో గంజాయి వాసనను పసిగట్టి ఎస్సై దేవరాజ్ తదితర సిబ్బంది అతని అదుపులోకి తీసుకున్నారనీ సిఐ విజయ్ కుమార్ వెల్లడించారు. వికారాబాద్ జిల్లా తాండూర్ ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న గులాం సుల్తాన్ అహ్మద్ (52) సీజ్ చేసి ఉంచిన గంజాయిని బయటకు తీసి తన వరుసకు కుమారుడైన అంజద్ కు అమ్మాలని అందజేశాడనీ పోలీసులు పేర్కొన్నారు. ఈ గంజాయిని అమ్మే క్రమంలో అంజాత్ షాద్ నగర్ పోలీసులకు చిక్కినట్లు తెలిపారు. కంచె చేను మేసిన చందంగా తప్పుచేసి ఇరుక్కున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ గులాం సుల్తాన్ అహ్మద్, అంజద్ ఇరువురులను పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. 75 వేల విలువగల ఈ గంజాయితోపాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితులు జల్సాలకు అలవాటు పడి సులభ మార్గంలో డబ్బులు సంపాదించాలని తన వరుసకు బాబాయి అయిన గులాం సుల్తాన్ అహ్మద్ తో కలిసి గంజాయి విక్రయాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ కేసును శంషాబాద్ డిసిపి రాజేష్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై దేవరాజును అభినందిస్తూ వారికి తగిన రివార్డు కోసం పై అధికారులకు సిఫార్సు చేయడం జరిగిందని సిఐ విజయకుమార్ తెలిపారు.

పెద్ద మొత్తంలో అల్ఫాజోలం టాబ్లెట్స్ పట్టివేత..

1.80 లక్షల టాబ్లెట్స్ స్వాధీనం

టాబ్లెట్స్ తో పాటు

ఇద్దరు నిందితులను ప్రవేశపెట్టిన ఎక్సైజ్ అధికారులు

విశ్వంభర, హైదరాబాద్: నిషేధిత అల్ఫాజోలం టాబ్లెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు ఉత్తరప్రదేశ్ కాన్పూర్ నుంచి తెప్పించి చాలా మందికి ఎక్కువ ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటూ లబ్ధి పొందుతున్నారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి పేర్కొన్నారు. ఎక్సైజ్ భవన్ లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఇద్దరు నిందితులతో పాటు ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నటువంటి ఆల్ఫాజోలం టాబ్లెట్లను మీడియా ముందు ప్రదర్శించారు. కల్తీకల్లుకు, మత్తు రావడానికి వినియోగించేటువంటి అల్ఫా జోలం టాబ్లెట్లను ప్రభుత్వం గతంలో నిషేధించింది ఈ మేరకు కొందరు వ్యక్తులు ఇలాంటి అనుమతులు లేకుండా ట్యాబ్లెట్లను వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించి రూపాయలు నాలుగు రూపాయలకు ఒక టాబ్లెట్ విలువ ఉన్నటువంటి టాబ్లెట్ను పది రూపాయల నుంచి 20 రూపాయలకు ఎలాంటి మందుల చిట్టి లేకుండా అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకున్నట్లు ఖురేషి వెల్లడించారు. రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ టీం సుభాష్ చంద్ ర్ ఇద్దరు ఎస్ఐలు డ్రగ్ కంట్రోల్ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ డ్రగ్ ఇన్స్పెక్టర్లు అనిల్ రెడ్డి గోవింద సింగర్ తో పాటు ఎస్టిఎఫ్ నుంచి సిహెచ్ నాగరాజు, రవి శ్రీనివాస్, సందీప్ రెడ్డి,కిషన్ ఫారుకి,సిబ్బంది కలిసి హయత్ నగర్ లోని ఆటో నగర్ లో డ్రగ్స్ ఉత్తరప్రదేశ్ నుంచి కొరియర్లో రావడంతో వీరందరూ కలిసి మూకుమ్మడిగా దాడి చేసి టాబ్లెట్లను రికవర్ చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

హైదరాబాద్ కు చెందిన పువ్వాడ లక్ష్మణ్ అన్న కేతుపల్లి మునిశేఖర్ పొద్దుటూరుకు చెందినటువంటి ఇద్దరు వ్యక్తులను టాబ్లెట్లతో పాటు మూడు డిపార్ట్మెంట్లు కలిసి అరెస్ట్ చేశారు.నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు 1,80,000 టాబ్లెట్లు విలువ సుమారు రూ. ఆరు లక్షల 48 వేల విలువ ఉంటుందని అధికారులు అంచనా వేశారు.మీడియా సమావేశంలో అడిషనల్ కమిషనర్ గురించి తో పాటు రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ సరూర్నగర్ ఎక్సైజ్ సూపరింటెంట్ ఉజ్వల రెడ్డి రంగారెడ్డి ఏఎస్ జీవన్ కిరణ్ తో పాటు ఇతర సిబ్బంది ఈ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటికే హైదరాబాద్ డ్రగ్స్ గంజాయితో అల్లాడుతున్న క్రమంలో కొత్తగా ఉత్తరప్రదేశ్ నుంచి నిషేజిత అల్ఫా జోలం టాబ్లెట్లను తీసుకురావడం పట్ల మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తామని జాయింట్ కమిషనర్ గురించి మీడియా ముందు తెలిపారు.

క్షీణించిన అడవులను పునరుద్ధరించాలి

అటవీ, జీవవైవిధ్య, విస్తృత పర్యావరణ క్షీణత అత్యంత ప్రమాదకరం

భయంకరమైన అటవీ నిర్మూలన కార్యకలాపాలను ఆపాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా

విశ్వంభర, హైదరబాద్: ప్రపంచ వ్యాప్తంగా అటవీ, జీవవైవిధ్య, విస్తృత పర్యావరణ క్షీణత అత్యంత ప్రమాదకరం అని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ లో ప్రపంచంలోనే భారత దేశం నెంబర్ టు గా ఉందని, అందులో దక్షణ భారత దేశంలో తెలంగాణ నెంబర్ వన్ ఉందని, ఇది ప్రజల జీవితాలు,జీవనోపాధికి హాని కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) మరియు ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ సంయుక్తాధ్వర్యంలో హైదరాబాద్, బాగ్ లింగంపల్లి, సుందరయ్య పార్క్ వద్ద గురువారం ప్రదర్శన నిర్వహించింది. సయ్యిద్ అజీజ్ పాషా తోపాటు ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రేఖల గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి ప్రభాకర్, నాయకులు ఎ. విజయ లక్ష్మి, ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి సురేందర్ తదితరులు ప్లకార్డులు చేతబూని భూమి మనుగడ, మన ప్రాధాన్యత. భూమి అందం మన కర్తవ్యం. ఆకుపచ్చగా ఆలోచించండి, శుభ్రంగా జీవించండి, రేపటి కోసం ఈరోజే భూమిని కాపాడండి అని నినాదాలు చేస్తూ నిర్వహించిన ప్రదర్శన పలువురిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా సయ్యిద్ అజీజ్ పాషా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, ప్రబలమైన పారిశ్రామికీకరణ, ప్రభుత్వాల తిరోగమన విధానాలు పర్యావరణానికి భారీ ముప్పును కలిగిస్తున్నాయని, దేశంలో 2019 నుండి 2022 వరకు 5.8 మిలియన్ చెట్లు నరికివేయబడ్డాయని, ఉపగ్రహ సర్వేలో 11% పూర్తిగా పెరిగిన చెట్లు నరికివేయబడ్డాయని తేలిందని, దక్షిణ భారతదేశంలోని తెలంగాణ లో అత్యధికంగా 2014 నుండి 2024 వరకు 11,422 హెక్టార్ల అటవీ భూమిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేసారు. వాతావరణ సంక్షోభం, క్షీణిస్తున్న గాలి నాణ్యత, అటవీ నిర్మూలన మరియు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం ప్రజల జీవితాలను ప్రమాదంలో పడవేస్తున్నాయని, ఇది గ్లోబల్ వార్మింగ్ కు నిదర్శనమన్నారు. ఈ సంవత్సరం లో దేశవ్యాప్తంగా 45C కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, ఇది నీటి వనరులను, వ్యవసాయం, ప్రజల ఆరోగ్యాలపై ప్రభావితం చేసిందని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ ను ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం 1997 క్యోటో ప్రోటోకాల్, 2015 పారిస్, సిఓపి19, బాకు వంటి అంతర్జాతీయ ఒప్పందాలను ఖచ్చితంగా బలోపేతం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. పట్టణ ప్రకృతి దృశ్యానికి ప్రాణం పోసే పర్యావరణపరంగా సున్నితమైన కంచా గచ్చిబౌలి అడవిని తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం వేలం వేయడానికి అక్కడ ఉన్నసహజ గడ్డి, చెట్లను నరకడం, వన్యప్రాణులకు హాని జరగడం దారుణమన్నారు. సుప్రీం కోర్టు జోక్యంతో కంచా గచ్చిబౌలి అడవి భూములు రక్షించబడ్డాయని చెప్పారు. గ్రీన్ హౌస్ వాయువుల విడుదల నుండి ప్రపంచాన్ని రక్షించడంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఇంటి నిర్మాణానికి అనుమతి పొందే ముందు రెండు చెట్లను నాటాలనే ముందస్తు షరతును బెంగళూరు మునిసిపల్ కార్పొరేషన్ అమలు చేస్తుందని, దీనిని జిహెచ్ఎంసి మరియు ఇతర మునిసిపాలిటీలను అమలు చేయాలనీ సయ్యిద్ అజీజ్ పాషా విజ్ఞప్తి చేసారు. రేఖల గోపాల్ మాట్లాడుతూ ఊహించలేని వేడి తరంగాలు, వరదలు మరియు తుఫానులు తీవ్రతరం అవుతున్నందున, గ్లోబల్ వార్మింగ్ మొత్తం ప్రపంచానికి అతిపెద్ద ప్రమాద సంకేతం అని, మన జీవితాలకు అనూహ్యమైన నష్టాన్ని కలిగిస్తున్న ప్లాస్టిక్ను ఒక్కసారి వాడకానికి నో చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణ పచ్చదనాన్ని పెంచడానికి చట్టాలు మరియు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆయన నొక్కి చెప్పారు. కడారి ప్రభాకర్, మాట్లాడుతూ అంటార్కిటికా మరియు పచ్చని భూముల వద్ద హిమానీనదాలు చాలా వేగంగా కరిగిపోతున్నందున, ప్రస్తుత పర్యావరణాన్ని మెరుగుపరచడానికి బహుముఖ విధానం అవసరమని అన్నారు. మునీర్ పటేల్ మాట్లాడుతూ పర్యావరణం పై ప్రజా అవగాహన ప్రచారం మరియు సమాజ భాగస్వామ్యాన్ని అవసరమన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం

- కలెక్టర్ రాహుల్ రాజ్

విశ్వంభర, మెదక్: ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని వీడియో సమావేశ హాల్లో బడిబాట కార్యక్రమం పై నిర్వహణ పై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రేపు అనగా శుక్రవారం నుండి బడిబాట కార్యక్రమంపై పంచాయతీ సెక్రెటరీ, ఉపాధ్యాయుల సమన్వయంతో గ్రామసభలు నిర్వహించి తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఈ గ్రామసభలో పాలు పంచుకునేలా చూడాలన్నారు. ప్రతి, బాల, బాలికలు పాఠశాలలో అడ్మిషన్ పొందేలా ప్రత్యేక శ్రద్ధతో బడి బాట నిర్వహించాలని ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ ఔట్ నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో బాలికల నమోదు శాతం పెంపొందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల్లో మరుగుదొడ్లు వినియోగంలో ఉండాలని అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని,

ఇంటింటి సర్వే చేపట్టి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలు ఎక్కడ డ్రాప్ ఔట్ కాకుండా చూడాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సైతం బడిబాట కార్యక్రమంలో పాల్గొంటూ బాలికలు ఎక్కడ విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట బాలికలు పదవ తరగతి ముగిసిన తర్వాత కూడా ఇంటర్ చదివేల వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి మండల సూపర్వైజర్ వారి పరిధిలో గల బాలికలపై శ్రద్ధ వహిస్తూ చదువు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలలో వార్డు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ బాల కార్మికులు లేకుండా చర్యలు తీసుకోవాలని, పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలలో నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. జూన్ 8 నుంచి జూన్ 10 వరకు 3 రోజులపాటు ఇంటింటికి తిరిగి పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు సేకరించి ప్రతి గ్రామంలో గ్రామ రిజిస్టర్లు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. జూన్ 06న ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి బడిబాట కార్యక్రమంలో జరిగిన పురోగతిని చర్చించాలని, జూన్ 07 ఇంటింటికి బడిబాట, జూన్ 11 న పాఠశాలకు సంబంధించిన వారితో సమావేశం నిర్వహించి విద్యార్థులందరినీ చేర్చుకోవాలి, 12 తేదీన పాఠశాలల ప్రారంభం చాలా గొప్పగా నిర్వహించాలన్నారు. ఈ నెల 13 నుండి 15 వ తేదీ వరకూ ప్రాథమిక విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ అధికారి సూచించారు. జూన్ 16న బాలికల విద్యా ప్రాముఖ్యతను వివరించాలని, జూన్ 18న ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐవిపి ప్యానల్ ద్వారా డిజిటల్ విద్యాబోధన ప్రారంభించాలని, విద్యార్థులచే మొక్కలు నాటించాలని, జూన్ 19న క్రీడ పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, ఇంటర్మీడియట్ అధికారి మాధవి, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వెల్ఫేర్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం మొక్కలు నాటిన యువ నాయకులు

విశ్వంభర, మెదక్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారంమెదక్ పట్టణంలోని గోల్కొండ వీధి నివాస పరిసర ప్రాంతాల్లో పలు రకాల మొక్కలు నాటిన నాటారు. ఈ కార్యమంలో బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు కసాపురం కిరణ్ మరియు మిత్రబృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించుకుంటే వర్షాలు సకాలంలో పడతాయనీ, స్వచ్ఛమైన గాలి అందరికీ అందుతుందని, ప్రతి ఒక్కరు కూడా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పర్యావరణంలో మనం కూడా భాగస్వామ్యమై పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, మిట్టపల్లి మధు, నవీన్, దశరథ్, బోసచంద్ర ,సురేష్, శివా తదితరులు పాల్గొన్నారు..



ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ సాచివేత దోరణి సరైంది కాదు

కమిటీలతో కాలయాపన చేయకుండా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

విశ్వంభర, హైదరాబాద్: 9ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై కమిటీల పేరుతో కాలయాపన చేసే దోరణి సరైంది కాదని, పోరాటాలు చేయాల్సిన అనివార్యత కల్పించవద్దని టియస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటి సమావేశము రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన రాష్ట్ర కార్యాలయం హైదరాబాదు దోమల్‌గూడలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా చావ రవి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ,పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో సాచివేత దోరణితో కాలయాపన చేయడాన్ని క్షేత్రస్థాయిలో తీవ్రంగా నిరసిస్తున్నారని, అసంతృప్తి ఆందోళనగా మారుతోందని, ప్రభుత్వం గమనించకపోచే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. నెల మొదటి తారీఖున జీతం చెల్లిస్తున్నామనే ఒక్క అంశం తప్ప ఇతర సమస్యలేవి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం అవుతుందన్నారు. అదే విధంగా గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కెజిబివి పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇప్పటికీ మొదటి తారీఖున వేతనాలు అందడంలేదు . ప్రతినెలా ఆలస్యంగా చెల్లిస్తున్నారన్నారు.పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయంలో నెలకు 500 కోట్లు కేటాయించి పరిష్కారం చేస్తామని మార్చి లో ఇచ్చిన హామి కూడా అమలులోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. అలాగే ప్రభుత్వం నియమించిన కమిటీ దృష్టికి ఆర్థిక, ఆర్థికేతర డిమాండ్లను తెచ్చినప్పటికి కనీసం ఆర్థికేతర డిమాండ్లను కూడా పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 5 పెండింగ్ డిఏలలో కనీసం మూడు డిఏలనైనా వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల పున:ప్రారంభానికి ముందే అన్ని గురుకుల పాఠశాల సమయసారణిని ఉ॥ 9:00 నుండి ప్రారంభమయ్యే విధంగా మార్చాలని ఇది విద్యార్థుల దృష్ట్యా ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సమస్యల పై ప్రభుత్వ ఇదే సాచివేత దోరణితో వ్యవహరిస్తే స్వతంత్ర పోరాటాలతోపాటు, ఉపాధ్యాయులను ఏకం చేసి ఐక్య ఉద్యమాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకై చేపడుతున్న బడిబాట కార్యక్రమాన్ని పాఠశాలల ప్రారంభానికి ముందే జూన్ 6 నుండి నిర్వహించడాన్ని అభినందిస్తూనే, విద్యాశాఖాధికారులు తొందరపాటుగా ఇచ్చిన మెమో నెం. 1267 ద్వారా ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ మెమో ఒకవైపు నోటితో నవ్వి మరొకవైపు నొసటితో వెక్కిరించినట్లుగా ఉందని ఒకవైపు బడిబాట పేరుతో మూసివున్నపాఠశాలలను తెరిచే విధంగా, అలాగే విద్యార్థుల సంఖ్య తక్కువగా వున్నచోట పెంచే విధంగా చర్యలు తీసుకునే దానికి పూర్తి భిన్నంగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని బడిబాట కార్యక్రమం పూర్తికాకముందే, పాఠశాలల పున:ప్రారంభానికి ముందే టీచర్లను సర్దుబాటు చేయడానికి పూనుకోవడం ప్రభుత్వ పాఠశాలల సహజ మరణానికి ఊతమిచ్చేదిగా ఉందని దీంతో తల్లిదండ్రులలో ఎలా నమ్మకం కలిగించి, పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలని, తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా తల్లిదండ్రులు కోరుకుంటున్న సందర్భంలో నిబంధనలు సవరించి, విద్యార్థుల నమోదు పూర్తయిన తర్వాత ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలు చేయాలని, డిప్యూటీ ఇఒ, డైట్ లెక్చరర్లు, ఎంఈఒ పోస్టులకు విద్యా శాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనంను మరింత పౌష్టికంగా అందించడంతోపాటు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని, స్థానిక పాఠశాలల పిల్లల సంఖ్యను పెంచడానికి స్థానిక సంస్థల ప్రతినిధులను, ప్రభుత్వ అధికార్లను భాగస్వాములను చేయాలని కోరారు. ప్రతీ సంవత్సరం ప్రమోషన్లు, బదిలీలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీమేరకు జూన్, జులై నెలల్లో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో వాటిని పూర్తిచేయాలని, ఖాళీ పోస్టుల భర్తీకి డియస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మోడల్ స్కూల్స్‌ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి. అలాగే మోడల్‌స్కూల్ టీచర్లకు పదోన్నతులు వెంటనే ఇవ్వాలి. గురుకుల, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు ఇవ్వాలని, కెజిబివి టీచర్లకు మినిమం పేస్కేలు వర్తింప జేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. దుర్గాభవాని, రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, పత్రిక ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర చైర్మన్ యం. రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కె. సోమశేఖర్, వి. శాంతికుమారి, జి. జి. నాగమణి, నాగమల్లేశ్వరరావు లతోపాటు వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, రాష్ట్రకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలి

రైతులను వెంటనే విడుదల చేయాలి

విశ్వంభర, గద్వాల్ : గద్వాల జిల్లా రాజోలిమండలం పెద్దదన్వాడ గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న 60 మందిని అక్రమంగా అరెస్ట్ చేసి, 12 మందిని రిమాండ్‌కు పంపడాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఈ కంపెనీ నిర్మాణానికి తీసుకున్న భూమికి సమీపంలో ప్రభుత్వం దళితులకిచ్చిన భూములు మరియు ఇంటి స్థలాలు ఉండడం వల్ల వివిధ రకాల కాలుష్యం ఏర్పడుతందని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నారు. గ్రామసభల తీర్మానం, గ్రామపంచాయితీ అనుమతి లేకపోయినా కంపెనీ యాజమాన్యం జేసీబీలు, టిప్పర్లు, కంటైనర్ల తో పాటు, బయటినుండి కూలీలను తెచ్చి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. దీన్ని వ్యతిరేకించిన రైతులపై, మహిళలు, ప్రజలపై పోలీసులు లాఠీఛార్జ్ చేసింది. స్థానికంగా రైతుల, ప్రజల ఆమోదం లేకుండా, వారి అనుమతి లేకుండా పరిశ్రమను ఏర్పాటు చేయడం సరైంది కాదు. ఎన్నికల సమయంలో ఇథనాల్ కంపెనీని ఏర్పాటు చేయబోమని కాంగ్రెస్ హామీ ఇచ్చినా, ప్రస్తుతం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. తక్షణమే రిమాండ్ చేసిన వారిని విడుదల చేసి, అక్రమంగా బనాయించిన కేసులన్నింటినీ ఎత్తివేసి, ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

రెవెన్యూ సదస్సులను శాంతియుతంగా జరపాలి.. యేళ్ళ తరబడి అధికారుల చుట్టూ తిరిగినా తమ భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో చలామంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ రెవెన్యూ సదస్సులో తమ సమస్య చెప్పడానికి వచ్చిన వృద్దరైతు అల్లెపు వెంకటిని మెడపట్టి గెంటేసిన పోలీస్ అధికారిని సస్పెండ్ చేసే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాపితంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఎలాంటి అవాంచనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా శాంతియుత వాతావరణంలో జరిపి, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) కోరుతున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రకటనలో తెలిపారు.